# మనిషిపోతే మాత్రమేమి?

"అమ్మో అమ్మా - నాయమ్మ నాయమ్మో - నాయమ్మా. నీకప్పుడే నూరేళ్ళు నిండాయా నాయమ్మో నాయమ్మా...." బస్సు ఆగటం ఆలస్యం పైట చెంగుతో ముఖాన్ని కప్పుకుని ఏడ్వసాగింది రత్నం.

"వూరొచ్చింది దిగు దిగు...." ఆమె భర్త సుబ్బారావన్నాడు బేగ్గు లందుకుంటూ.

ఆమె స్వరం హెచ్చించి మరీ ఏడుస్తూ మధ్య మధ్య ముక్కు చీదుతూ బస్సు దిగింది.

బస్టాండులోని జనం ఆమెని గుర్తు పట్టి సానుభూతి కురిపించారు. "ఈవిడ కోసమే శవాన్నింకా శ్మశానానికి తీసుకెళ్ళకుండావుంచారు" అని ఒకరంటే. "తల్లంటే పెద్దకూతురికన్నా ఈవిడకే ఎక్కువ ప్రేమ కాబోలు" అన్నారింకొకరు దుఃఖిస్తున్న ఆమెని చూసి.

రత్నం ఆమె భర్తా రిక్ష మాట్లాడుకు నెక్కారు.

వీళ్ళ కోసమే ఎదురుచూస్తూ అసహనంగా కూర్చున్న వీధి అరుగు మీద పెద్దలూ బంధువులూ రిక్షని చూస్తూనే తమకు తెలీకుండానే తేలిగ్గా నిశ్వసించారు. ఇతర ఏర్పాట్లు చెయ్యడాని కప్పుడే కొందరు సిద్ధమయ్యారు.

అంతవరకూ తగ్గుస్థాయిలో సాగుతోన్న ఏడ్పులు రిక్షాని చూసి ఒక్కసారే హెచ్చుస్థాయికి చేరుకున్నాయి. రత్నం కూడా రిక్షా దిగుతూనే గుండెలు బాదుకుంటూ ఘొల్లుమని ఏడుస్తూ ఇంట్లో కెళ్ళింది.

పాలేరు కుర్రాడు సామాన్లని లోపలికి పట్టుకెళ్ళారు. రిక్షావాడికి డబ్బిచ్చి మెల్లగా అరుగు మెట్లెక్కి హాలు గుమ్మంవైపు నడిచాడు సుబ్బారావు.

హాలులో చాపమీద కట్టెలా పడివున్న అత్తగార్ని చూసే సరికతడి కళ్ళల్లోకి నీళ్ళు వురికి వచ్చాయి.

నిన్న మొన్నటి వరకూ ఎంతో ఇదిగా ఆరోగ్యంగా తిరిగినావిడ తనొస్తే చాలు అల్లుడుగారొచ్చారంటూ ఎన్నెన్నో మర్యాదలు చేసినావిడ ఇక లేరు. ఇక కన్పించరనుకునే సరికి గుండెల్నెవరో వుక్కుహస్తాలతో పిసుకుతున్నట్టుగా అన్పించిందతడికి· నీటి బుడగల కన్నా హీనం కదా ఈ మానవ జీవితాలనుకున్నాడు విరక్తిగా.

తన అక్క పార్వతమ్మ కన్నా ఇతర బంధువుల కన్నా బిగ్గరగా ఏడుస్తోన్న రత్నాన్ని చూసి "చిన్న కూతురికి తల్లంటే ఎంత ప్రేమ పాపం. పోన్లే కడచూపైనా దక్కింది. చిన్నకూతురు రానిదే శవాన్ని తీసుకెళ్ళకూడదని నారాయణస్వామిగారు పట్టుబట్టడం వల్లే అపారు" అని చెప్పుకోసాగారు ఓదార్చవచ్చిన షూరి వాళ్ళు.

వీధి అరుగు మీదో మూలన సర్వం కోల్పోయిన వాళ్లా కూర్చున్న మావగారి దగ్గరకి నడిచాడు సుబ్బారావు. ఆ ప్రక్కనే మోకాళ్లలో తల దూర్చి ఏడుస్తోన్న పన్నెండేళ్ల, పదిహేనేళ్ల బావమరుదుల తలలు నిమిరి కళ్లతోనే ఓదార్చి మావగారి ప్రక్కన కూర్చున్నాడు.

అతడి తోడల్లుడు రంగనాథం కూడా వచ్చి ఆ ప్రక్కనే కూర్చుంటూ "పెరిగ్రాం ఎప్పుడందిందీ" అనడిగాడు.

"తెల్లవారు జామునందింది. వెంటనే బయల్దేరి రైల్వేస్టేషన్ కొచ్చాం గాని రైలు గంటాలస్యంగా వచ్చింది భీమవరం వచ్చేసరికే తొమ్మిదిగంటలైపోయింది. వెంటనే బస్సు దొరకటం వల్ల ఇదిగో ఇప్పటికైనా రాగలిగేం" అని ఆగి మళ్ళీ అన్నాడు "అసలిలా ఎలా జరిగిందీ. మొన్న పండక్కి వచ్చినప్పుడు బాగానే వున్నారే!"

"అంతా కర్మ! భూమ్మీద నూకల్నిందేక పోవడాని కెంతసేపు పడుతుందీ. మొన్న పొద్దుట నొప్పికింద వచ్చిందిట. డాక్టరు ఇంజెక్షన్లవీ చేసి ఏం ఫర్లేదని చెప్పినా కూతుళ్ళకి కబురంపండీ నే నాట్టేకాలం బతకనని మొత్తిందిట అత్తగారు. తగ్గిపోతుందిలే అని మనకి కబురంపలేదుట. నిన్న సాయంత్రం మళ్ళీ నొప్పి వచ్చిందిట. దాంతో మీకు టెలిగ్రాం ఇచ్చి మా కోసం మనిషిని పంపారు నేను రాత్రి పొలాన్నుంచి వచ్చేసరికి వచ్చేడతను. ఏవిటంటే ఇదీ సంగతన్నాడు. వెంటనే రెండెడ్ల బండి కట్టుకునొచ్చాం. మే మొచ్చిన కాస్సేపటికే అంతా అయిపోయింది" నిట్టూర్చారిద్దరూ.

శవం లేస్తేగాని స్వవంశస్తులు స్నానపానాదులు చెయ్యడం కుదరదు గనుక త్వరగా మిగతా ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆడవాళ్లు ఘొల్లుమంటోంటే శవాన్ని బయటికి తీసుకొచ్చి స్నానం చేయించారు. మొఖానికి పసుపురాసి బొట్టు పెట్టారు. ఒక నెక్లెస్ కూడా తెచ్చి పెట్టారు.

కడసారిగా తల్లికి నమస్కరిస్తూ తలెత్తి చూసిన రత్నం ఒక్కక్షణం త్రాన్పడి పోయింది నెక్లెస్‌ని చూసి. తల్లి మెడలోని బొందూ కవకాలూ జత గాజులూ నెక్లెస్సూ పెరసి వన్నాలుగు పదిహేను కాసుల బంగారం వుంటుందనుకుని లోలోన మురిసిపోతుంటా వుండలేక పోయిందా అమె.

పాడె లేచింది.

శ్మశానం వైపు సాగింది శవయాత్ర.

మెల్లగా దుఃఖాన్నుండి తేరుకుని స్నానాలు చేశారు, ఇంతలో ప్రక్కింటి వాళ్ళు కాఫీలు కాచి తేగా అవి త్రాగారు.

ఎవ్వరూ చూడకుండా అక్కగార్ని వసారా మూలకి తీసుకెళ్ళి "అమ్మ నక్లీసు ఎప్పుడు వదిలించారే ? అప్పు వడ్డీతో కలిసి దాని ఖరీదుని మించిపోయిందని మార్వాడీకే వదిలేస్తున్నా నన్నాడుగా నాన్న?" అనడిగింది రత్నం.

"మొన్న అమ్మ ఆ నక్లీసు పెట్టుకోవాలనుందంటే చిన్నమామ్మ గారి కోడలి నక్లీసు పెట్టి అమ్మ నక్లీసు తెచ్చాడంట నాన్న రెండ్రోజుల్లో మళ్ళీ మార్చే పద్ధతి మీద"

"ఆ గొడవలు మనకెందుగ్గాని అమ్మ బంగారం మనకే వస్తుంది కదా. నక్లీసుతో కలిపి మొత్తం పద్నాలుగు కాసులకి పైనే గాని తక్కువ వుండదు. అంటే మనకి చెరో ఏడుకాసులూ వస్తాయి"

"ఆ నక్లీసు మన కిమ్మంటే బాగోదేమోనే" సంశయించింది పార్వతమ్మ.

"తల్లి బంగారం కూతుళ్లడగటం తప్పని ఏ పెద్దమనిషంటాడో అనమను. నీకెందుకూ నాన్నని నే నడుగుతాను కదా. నువ్వేమనుకుంటు న్నావో గాని కాసు బంగారమంటే వెయ్యి రూపాయలే".

పార్వతమ్మ మరి మాట్లాడలేక పోయింది. "ఈ గొడవయ్యాక అడుగుదాంలే" అంది చివరికి.

"నాన్న నక్లీసుని తిరిగిచ్చేస్తే మనకింకేం మిగుల్తుంది ?!"

"ఇప్పుడే అడిగితే అంతా ఇదిగా అనుకుంటారేమోనే"

"ఎవరో ఏడి' అనుకుంటారని మనం నష్టాన్ని కొని తెచ్చు కుంటామా. నీ కెందుకు నువ్వూరుకో. అన్నీ నేను మాట్లాడతానుగా. మనం ఏం అడిగినా ఏం పుచ్చుకున్నా ఈ వేడిలోనే చెయ్యాలే. తర్వాతె వరూ పట్టించుకోరు."

ఇంతలో ఎవరో అటుగా రావడంతో ఏమీ ఎరగనట్టు వచ్చేశారు బయటికి.

వూరి వాళ్ళొచ్చి పలకరిస్తూ సానుభూతి కురిపిస్తూ పోయినావిడ మంచితనం గురించి ఏకరువు పెడుతోంటే ఓ ప్రక్క అయిష్టంగానే దుఃఖిస్తూనే వినసాగింది రత్నం.

ఆమెకి తల్లంటే ప్రేమ లేకపోలేదు. తల్లి మరణానికి బాధ పడు తోంది కూడా. కాని ఆ బాధని మించి పోయింది బంగారం కోసం ఆమె పడుతోన్న బాధ. ఇదివరకు పచ్చళ్ళ నుండి వడియాల దాకా కారం నుండి చిరుతిండి వరకూ సమస్తం పుట్టింటి నుంచే పట్టు కెళ్ళేది రత్నం. కానిహ అది వీలు పడదు. ఎంచేతంటే ఆడదక్షత లేని ఇంట్లో ఆడ బడుచులకి అందేవి బహు తక్కువ. బొత్తిగా అందకపోయినా పోవచ్చు కూడా. అంచేతిప్పుడే వీలున్నంతా నొల్లేసు కోవాలని ఆమె తాపత్రయం!

చీకటి పడుతూండగా భర్తని చాటుకు పిలిచి విషయం వివరించింది రత్నం.

అతడాశ్చర్యంగా భార్యని చూస్తూ "అయ్యో- మీ అమ్మ పోయి ఒక్కరోజు గడవలేదు. నీ కిదేం పోయే కాలమే. ఎవరైనా వింటే నోట్లో వుమ్మేస్తారు" అన్నాడు.

"చాల్లెండి చాదస్తం. మా అమ్మ మీద నా కంటే మీకే ఎక్కువ ప్రేమ పొడుచుకొస్తోందే !"

"అది కాదే...."

"మీకేం తెలీదు గాని వూరుకోండి."

"మీ అక్కగా రేమంటారో "

"అదీ ఒప్పుకుంది లెండి. మా అమ్మ పోక ముందే మా అక్కా వాళ్ళా వచ్చేరండీ. చూస్తోంటే మా అమ్మ దానికి చాటునేదో అందిచ్చినట్టే వుంది"

"తెలిసీ తెలియని మాటలనకు కళ్ల పోతాయ్."

"హుఁ సరిపోయింది గానీ బంగారం సంగతి మా నాన్న నడగండి."

"నేనా ? నాకు నోర్రాదుగాని నన్నొదిలెయ్ రత్నం."

"పేరుకి పెద్ద మొగాళ్ళు ఈ మాత్రం పని కూడా చెయ్యలేరు!" రుసరుస లాడింది రత్నం.

రాత్రి భోజనాలయ్యాక అంతా హాల్లో కూర్చున్నారు- చెయ్యాల్సిన కర్మ కాండల గురించీ ఖర్చుకి డబ్బు సర్దుకోవడం గురించీ మాట్లాడుతూ.

ఆ కబుర్లు అయ్యా అవ్వడంతోనే "అమ్మ బంగారం గురించి కూడా ఒక మాట చెప్పు నాన్నా" అంది రత్నం ఏమీ ఎరగనట్టు.

"నేను చెప్పేదేముందమ్మా. మీ అమ్మ నగలంటూ మిగిలినవి బొందూ గాజులూ కవళాలేగా. మీరిద్దరూ పంచుకోండి"

"నక్లెసు మాట ?"

"అదా. దాని సంగతి మర్చిపోండమ్మా. ఇదివర కెప్పుడో వ్యవసాయప్పెట్టు బళ్ళకి మార్వాడీ దగ్గర తాకట్టు పెట్టాంగా. అసలూ వడ్డీ కలిసి దాని ఖరీదుని మించిపోతే వదిలేసుకున్నాం. ఆ వస్తువు మీ అమ్మకి పుట్టింటి వాళ్ళు పెట్టింది. అంచేత దాన్నోసారి పెట్టుకోవాలనుందని మీ అమ్మ మొన్న ప్రతిమాలడంతో మన లక్ష్మి నక్లెసు హామీ క్రింద పెట్టి దాన్ని తెచ్చాను. ఈ గొడవయ్యాక దాన్ని పంపెయ్యకపోతే బాగుండదు."

"ఆ అప్పుని నువ్వే ఎలాగో తీర్చుకోవాలి గాని మాకు రావాల్సిన బంగారం ఎవరికో ఇచ్చేస్తానంటావేం నాన్నా"

దెబ్బ తిన్నట్టుగా చూశారు నారాయణస్వామి గారు. ఓ క్షణం పోయాక అన్నారు" నువ్వన్నది నిజమేనమ్మా. కాని దినవారాలకి డబ్బెలా తేవాలో తెలీకుండా వుంది. ఇంకేం చెయ్యలేక వ్యవసాయం చెయ్యడమే గాని అందులో ఏమీ మిగల్టం లేదమ్మా. ఇటువంటి పరిస్థితుల్లో మార్వాడీ అప్పెలా తీర్చగలన్చెప్పు ? నా మాట విని ఆ వస్తువు సంగతి మర్చిపోండి. బ్రతికి బాగుంటే రేపెప్పుడో అంతకంతా పెట్టకపోం"

"న్యాయం ఆలోచించు నాన్నా"

"ముందు మా కష్ట నష్టాల గురించా లోచించమ్మా. ఏదోలా మీ పెళ్ళిళ్ళు చేశాం. మగ పిల్లలిద్దరూ చిన్న వాళ్ళు. వాళ్లని చదివించాలి. పెద్ద చెయ్యాలి. వాళ్ళ ముఖం చూసైనా ఆ వస్తువు మాట మర్చిపో తల్లీ" అంటూ బయటి కెళ్ళిపోయారు నారాయణస్వామిగారు.

రత్నం మొహం ముడుచుకుంది.

ఆ సంగతంతటితో ముగిసి పోవడం ఇష్టం లేదు సుబ్బారావు తోడల్లుడు రంగనాధానికి. నిజానికి బంగారం గురించిన ఆలోచన రత్నాని కన్నా అతడికే ముందొచ్చింది. కాని బయట పడితే "అన్నీ తెలిసిన పెద్దల్లుడివి. నువ్వలా మాట్లాడటం మర్యాద కాదు." అంటారని వూరు కున్నాడు.

తీరా విషయం రత్నం కదిపేసరికి చాలా సంతోషించాడు. మావ గారి మాటల కామె నీరుగారి పోవడంతో ఇక రంగంలోకి దిగక తప్ప లేదతడికి.

"నువ్వడిగింది సమంజసమేనమ్మా రత్నం. మీ అమ్మ తాలూకు ఆస్తిపాస్తులన్నీ మీ అక్కా చెల్లెళ్ళకి సమంగా చెందాలి. ఆవిడ పేర్న

పొలమూ పుట్రా ఎలాగూ లేవు గనుక వున్న బంగారమైనా మీ కివ్వెయడం న్యాయం. కాని మావగారు అన్నీ తెలిసి కూడా ఎంచేతో అలా అంటున్నారు మరి"

ఊహించని విధంగా బావగారు తనకి వత్తాసు పలికేసరికి రత్నం పొంగిపోయింది.

"మీరు కూడా చెప్పి చూడండి బావా. మీరు చెబితే కాదనరు" అంది వెంటనే.

"నేనడిగితే ఆయన బాధ పడొచ్చు. మీ మేనమావతో రేపు అడిగించు రత్నం. మీకు రావాల్సింది రాకుండా ఎవ్వరూ అడ్డు వస్తేరు" అన్నాడు రంగనాథం.

రత్నానికి వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. ఆ మర్నాడే మేనమావకి విషయం వివరించి, "మా అమ్మ బంగారం మాకు దక్కాలనుకోవడం అన్యాయమా మావయ్యా. నువ్వే చెప్పు. న్యాయం ధర్మం లోకరీతి నీకు తెలీనివి కావు కదా" అంటూ కళ్లనీళ్ళు పెట్టుకుంది.

"నేను కనుక్కుంటాన్లే అమ్మాయ్" అన్నాడాయన.

"ఇవాళే అడిగేసెయ్ మావయ్యా"

"ఇంట్లో వాళ్లూ పీళ్ళూ వున్నారుగా దినవారాలవ్వనీ మాట్లాడదాం దేనికైనా సమయం సందర్భం అంటూ వుంటుంది...."

"నాన్న మమ్మల్ని పరాయి వాళ్లగా చూస్తున్నప్పుడు ఎవరో వున్నారని మేమెందుకు ఇదవ్వాలి ? అదేదో ఇవాళే తేల్చెయ్ మావయ్యా"

ఆయన కించిత్తు ఆశ్చర్యంగా అసహనంగా చిరాగ్గా చూశారు. చూసి "సర్లే" అన్నారు కాస్త విసుగ్గా.

అన్నట్టుగానే నారాయణ స్వామిగారి దగ్గర విషయం కదిపారాయన.

కూతురు తన మాటల్ని ఖాతరు చెయ్యకుండా మళ్ళీ ఇలా మధ్య వర్తి చేత అడిగిస్తుందని వూహించని ఆయన విస్తుబోయారు. అయినా తన అభిప్రాయాన్నీ నిర్ణయాన్నీ నిర్మొహమాటంగా చెప్పేశారు.

ఆ వార్త విని "మొత్తానికి మీ నాన్న ఖిలేవాడేనే" అని రంగనాథం వ్యాఖ్యానించాడు సుబ్బారావు రత్నం పార్వతమ్మా వుండగా.

"మా నాన్న కాదంటే వూరుకుంటామేమిటీ పెద్దమనుషుల్లో పెడతాం" రత్నం అంది రోషంగా.

"కాస్త మెల్లగా మాట్లాడవే ఎవరైనా వింటే బావుండదూ" అని సుబ్బారావు గొణుగుతోంటే రంగనాథం కల్పించుకున్నాడు.

"అలా భయపడతావేం తమ్ముడూ. మనకి న్యాయంగా రావాల్సింది మనం అడుగుతున్నాం గాని ఆయన దాచుకున్న మూటేమీ అడగటం లేదు కదా. మవ్వేం ఇదవ్వకు రత్నం. పెద్ద మనుషులూ అక్కర్లేదు పంచాయితీ అక్కర్లేదు గాని రేపు మన సుబ్బారావుని నర్సాపురం పంపిద్దాం. అక్కడ నాకు తెలిసిన ప్లీడరుగారున్నారు. ఆయన్ని కలుసుకుంటే పెట్టాల్సిన ముగ్గులన్నీ ఆయనే పెట్టి మీ నాన్న ముక్కు పిండి మరీ వసూలు చేసిస్తాడు. ఆయనో నోటీసు తగిలిస్తే చాలు మీ నాన్నేవిటి ఆ బ్రహ్మ దేవుడే దిగివస్తాడు"

రత్నం వంత పాడింది.

సుబ్బారావుకీ పార్వతమ్మకి బంగారం అంటే ఆశగానే వుంది కానీ నలుగురూ ఏమైనా అనుకుంటారేమోనని కాస్త భయంగా బిడియంగా వుంది. మొత్తానికి గొడవ గొడవవ్వకుండా ముగిస్తే— అదీ తమ కనుకూలంగా ముగిస్తే బావుణ్ణని భావిస్తున్నారు వాళ్ళు.

ఏమైతేనేం ఆ మరుసటి రోజున సుబ్బారావు నర్సాపురం వెళ్ళి ప్లీడరుతో మాట్లాడి రాక తప్పలేదు.

పెద్ద కర్మ రోజున—

నారాయణస్వామి గారి ఇల్లంతా బంధుమిత్రులతో నిండిపోయివుంది.

ఇంట్లో ఏడ్పులు వీధిలో ఓదార్పులు.

పెరట్లో వంటల ఘుమఘుమలు.

అక్కడికీ ఇక్కడికీ తిరుగుతూ అనునయిస్తూ అజామాయిషీ చేస్తూ హైరానపడి పోతున్నారు అయిన వాళ్ళు.

పోస్టుమేన్ సంకోచిస్తూనే వచ్చి నారాయణస్వామి గార్ని ప్రక్కకి తీసుకెళ్లాడు. ఆయన సంతకం పెట్టించుకుని రిజిస్టర్డ్ కవరు అందిచ్చాడు.

"ఎక్కడ్నుంచొచ్చిందో సంగతేవిటో నువ్వే కాస్త చదివిపెట్టు బాబూ"

నోటీసు చదివే సరికతడి మొఖం నల్లబడింది. ఇలాంటి ఉత్తరం ఈ సమయంలో తెచ్చిచ్చినందుకు బాధ పడుతూనే తల్లి బంగారం యావత్తూ కూతుళ్ళకి ఇవ్వకపోతే కోర్టు నాశ్రయించాల్సొటుందని రత్నం పార్వతమ్మల తరపున లాయరు గారిచ్చిన నోటీసు హెచ్చరికని వివరించి మెల్లగా జారుకున్నాడు పోస్టుమేన్.

నారాయణ స్వామిగారి మొఖం కందగడ్డ అయ్యింది. కొంచెం సేపటి వరకూ అక్కడే మ్రాన్పడి కూర్చుండిపోయారు.

ఏం జరిగిందంటూ వచ్చారు బంధువులు. ఉత్తరం ఎక్కడ్నుంచని అడిగారు. అందులో ఏముందని ప్రశ్నించారు.

అన్నిటికీ మౌనంతో సమాధానమిచ్చారాయన.

ఓ చెంప ఏడుస్తూనే ఆడవాళ్ళంతా చెరువు దగ్గరికెళ్ళడాని కుద్యుక్తులయ్యారు. వారితోబాటు వెళ్తోన్న రత్నాన్ని పిలిచి "అక్కేదీ రత్నం?" అనడిగారు నారాయణస్వామిగారు.

"ఇదిగో ఇక్కడుంది నాన్నా"

"మీరెక్కడి కెళుతున్నారమ్మా" తాపీగా అడిగారు.

"అదేవిటాన్నాన్నా అలా అడుగుతున్నావ్. చెరువు దగ్గరి కెళుతున్నాం"

"అక్కడి కెందుకమ్మా."

అంతా బుగ్గలు నొక్కుకున్నారు ఆయన మాటలు విని. ఆయన కొంచెం పైత్యం చెయ్యలేదు కదా అనీ అనుకున్నారు.

"భలేవాడివే నాన్నా. అమ్మ పునిస్త్రీగా వెళ్ళిపోయింది కదా చెరువులో స్నానం చేసి పసుపూ కుంకుమా గాజులూ చేటలూ అవీ అందరికీ వంచి పెట్టొద్దూ ?"

"అవన్నీ చేస్తే మీకేం వస్తుందే ? బంగారం వస్తుందా ?"

"నాన్నా !"

"చెప్పమ్మా బంగారం వస్తుందా ?"

"నువ్వేం ఎత్తి పొడవక్కర్లేదు. అమ్మకి పుణ్య గతులు దక్కుతాయని చేస్తున్నామంతే".

"మనిషి పోతే మీకేమమ్మా మీక్కావల్సింది ఆ పోయిన మనిషి తాలూకు బంగారమే గాని ఆ మనిషి కాదు. ఆ మంచీ కాదు. మిగిలి వున్న వారి మంచీ చెడూ గాని కాదు గదా! పైగా మిమ్మల్ని పెద్ద చెయ్యక్కర్లేదు పెళ్ళీ చెయ్యక్కర్లేదు. ఇంక అమ్మ లేకపోతే మాత్రమేమమ్మా ? నీ తమ్ముళ్ళ సంగతంటావా వాళ్ళ పాట్లేవో వాళ్ళే పడతారు. వాళ్ళ ఏడుపేదో వాళ్ళే ఏడుస్తారు. మధ్యన మీకేల ? అంతే కదమ్మా ?"

"మమ్మల్ని వెళ్లమంటావా వద్దా ?" వుక్రోషంగా అడిగింది రత్నం.

"వెళ్లడం ఎందుకమ్మా మీ అమ్మ పోవడంతోనే ఆవిడతో మీ సంబంధం తెగిపోయింది. మీకు సంబంధమున్నదల్లా ఆవిడ బంగారంతోనే.

దాని కోసమే గోతికాడి నక్కల్లా కాచుకుని కూర్చున్నారు. పైల పోకుండానే కనీ పెంచి పెద్ద చేసిన తల్లికింత పిండాకూడు పెట్టకుండానే కోర్టుల కెక్కి కన్న తండ్రికే నోటీసు పంపించేంత గొప్పవారు కదమ్మా మీరు. హూ- మీలాంటి పిల్లల్ని కన్నందుకు మా జన్మ ధన్యమయిందమ్మా. ఇదిగో మీక్కావల్సిన నగలు తీసుకోండి. ఇంట్లో మిగిలిన వాళ్ళెలాపోతే మీకేం గాని మీరు మాత్రం సంతోషించండి. ఇవి ధరించి మీరూ మీ నగలూ శాశ్వతం అనుకుంటూ పూరేగండి. వెళ్లండి. ఇంకోమాట- ఇవాళ మీరు ప్రవర్తించినట్టే రేపు మీ పిల్లలూ మీరు పోయినందుగ్గాక మీ ఆస్తి పాస్తులు సరిగ్గా దక్కలేదని బాధ పడతారేమో అలా జరక్కుండా ముందే పంచి ఇచ్చెయ్యండి. ఎంచేతంటే ఈ రోజుల్లో పిల్లలకి తల్లి మీదుండేవి ప్రేమాభిమానాలు కాదుకదమ్మా. ఆ బంధం కూడా ఒక్క ఏడుపుతోనే ఎగిరిపోయేది కూడా కదా. ఇక పిల్లలు చూపే ప్రేమంటావా అది వారి ఆస్తిపాస్తుల మీది ప్రేమ తప్ప వారి మీద గుండెల్లోంచి పొంగి వచ్చిన ప్రేమా మమకారం కాదు కదమ్మా- వెళ్లండి...." ఆవేదనతో రగిలి పోతూ నగలు విసిరికొట్టారు.

తండ్రి మాటలకి తలొంచుకుంది రత్నం.

పార్వతమ్మ ఏడ్చేసింది.

వారి కాళ్ళ వద్ద పడిన బంగారు నగలు దిక్కు మొహం వేసుకుని చూస్తూండి పోయాయి!

—o—

(ఆంధ్ర భూమి వారపత్రిక 3-6-'82)